క్లుప్తంగా

మతోన్మాద శక్తులను కట్టడి చేయాలి

ఖిలా వరంగల్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద ఫాసిస్టు బీజేపీ, ఆర్ఎస్ఎస్, మిత్ర పార్టీలు తిరిగి అధికారంలోకి రాకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) వరంగల్ జిల్లా కార్యదర్శి చిత్ర సూరి కోరారు. వరంగల్ పడమరకోటలోని ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌లో మైదం పాణి అధ్యక్షతన మాస్ లైన్ డివిజన్ ముఖ్యకార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా సూరి మాట్లాడుతూ దేశం ప్రశాంతంగా ఉండాలన్నా, కార్పొరేట్ పెట్టుబడిదారుల దోపిడీని అడ్డుకోవాలన్నా, ప్రజలకు కనీస ప్రజాస్వామిక హక్కులు దక్కాలన్నా ఈసారి బీజేపీ అధికారంలోకి రాకుండా ప్రజలు జాగ్రత్త పడాలని సూచించారు. 10 ఏళ్ల పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థను పెట్టుబడిదారులకు ప్రధాని మోదీ కట్టబెట్టారని ఆరోపించారు. సమావేశంలో సాబిరీకాని మోహన్, బొర్ల రమేష్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహారావు, సాగర్, లక్క మురళి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ నుంచి సొసైటీకి బదిలీ చేయండి

హసన్‌పర్తి: మడిపల్లిలోని ధాన్యం కొనుగోలు సెంటర్‌ను ఐకేపీ నుంచి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి బదిలీ చేయాలని రైతులు కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుకు ఆదివారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఇందిరా క్రాంతి పథం ఆధ్వర్యంలో మడిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం వల్ల తీవ్రంగా నష్టపోతున్నట్లు చెప్పారు. ఆ కొనుగోలు కేంద్రంలో అవినీతి చోటు చేసుకుంటోందని వివరించారు. తరుగు పేరిట నిర్వాహకులు మోసం చేస్తున్నారని రైతులు ఆరోపించారు. 42 కిలోల ధాన్యం తూకానికి బదులు 47 కిలోలు వేస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తరుగు పేరిట బస్తాకు అదనంగా ఐదు కోత విధిస్తున్నారని వాపోయారు. ఫలితంగా తాము తీవ్రంగా నష్టపోతున్నట్లు వివరించారు. సొసైటీ ద్వారా గ్రామాల్లో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల్లో 42 కిలోలు తూకం వేస్తున్నారని చెప్పారు. గంటూరుపల్లి, నాగారం గ్రామాల్లో ఐకేపీ ద్వారా నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల్లో పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు రావడంతో విజిలెన్స్ విచారణ సాగుతోందని రైతులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ రెండు కేంద్రాలు సొసైటీలకు అప్పగించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

ఆరోగ్యవంతమైన సమాజానికి పాటుపడాలి

న్యూశాయంపేట: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని భారత వికాస్ పరిషత్ డాక్టర్ సుధీర్‌కుమార్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా హనుమకొండలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పబ్లిక్ గార్డెన్‌లో సోమవారం నిర్వహించనున్న మంగల్‌పాండే బలిదాన్ దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి కే.సత్యనారాయణ, కోశాధికారి బి.వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులు గోవిందరాజులు, చంచల్ అగర్వాల్, కన్వీనర్లు బీసీ రామారావు, బీఎస్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రామానుజస్వామి, ప్రవీణ్‌కుమార్, విజయ్‌కుమార్, మాణిక్యరావు, వివేకానంద ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కేటాయించాలి



వరంగల్: పైడిపల్లి శివారు ఎస్సారెస్పీ ప్రభుత్వ భూమిలో రెండేళ్ల క్రితం 1,560 కుటుంబాలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నాయని, ఆ భూమిని వారికే కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. కూల్చివేసిన ప్రాంతాన్ని రాష్ట్ర పార్టీ నాయకులు ఆదివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులు, పిల్లలు, మహిళల పట్ల పోలీసు అధికారులు దురుసుగా ప్రవర్తించడం బాధాకరమని వాపోయారు. కూలీనాలి చేసుకుంటూ గుడిసెల్లో ఉంటూ బతుకీడుస్తున్న పేదలపై అధికారులు విరుచుకుపడడం శోచనీయమని వాపోయారు. ప్రభుత్వ నుంచి వారికి నష్టపరిహారం చెల్లించి, ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం చేసి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని వారు సూచించారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

వరంగల్: ఏనుమాముల పోలీసు స్టేషన్ పరిధిలోని మహిళలకు ఎన్నికల నిబంధనలు, ఓటుహక్కు వినియోగంపై ఇన్‌స్పెక్టర్ పులి రమేష్ అవగాహన కల్పించారు. బాలాజీ నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎస్సై నర్సింహారావు పాల్గొన్నారు.

వేలేరు పల్లె ప్రకృతివనంలో ఎండిపోయిన మొక్కలు



ధ్వంసమైన పీచర బృహత్ పల్లె ప్రకృతివనం గేటు



ఎండిపోయిన సోడషపల్లి పల్లె ప్రకృతివనం చెట్లు



మోడుబారుతున్న మొక్కలు

- నిర్వహణ లేదు.. నీళ్లు పోసేవారు లేరు..
- ధ్వంసమైన గేట్లు, పెన్సింగ్
- మొక్కల సంరక్షణపై దృష్టి సారించని అధికారులు

వేలేరు : గత ప్రభుత్వం హరితహారంలో భాగంగా ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాల్లోని మొక్కలు నీళ్లు లేక మోడుబారుతున్నాయి. గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేయడంతో వీటిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మండలంలోని వివిధ గ్రామపంచాయతీల్లో గల పల్లెప్రకృతి వనాలు నిరుపయోగంగా మారుతున్నాయి. మొదట్లో కొన్ని గ్రామపంచాయతీలు ట్యాంకర్‌తో నీరు పోస్తూ కాపాడుతూ వచ్చాయి. ప్రస్తుతం సిబ్బంది, అధికారులు అటువైపు తొంగిచూడడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని సోడాషపల్లి పల్లెప్రకృతి వనంలో నీళ్లులేక మొక్కలు ఎండిపోతుండడంతో అధికారుల తీరుపై ప్రకృతి ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ధ్వంసమైన బృహత్ పల్లె ప్రకృతివనం గేట్లు

అధ్వానంగా బృహత్ పల్లెప్రకృతి వనం

ప్రజలకు ఆహ్లాదం అందిచాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం మండలానికి ఒకటి చొప్పున బృహత్ పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఆదేశానుసారం మండల స్థాయి అధికారులు మండలంలోని సోడాషపల్లి, పీచర గ్రామాల పరిధిలో సమ్మక్క - సారాలమ్మ జాతర జరిగే సమీపంలో సూమారు 4 ఎకరాల్లో బృహత్ పల్లెప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. ప్రారంభదశలో మొక్కల సంరక్షణ సక్రమంగా చేపట్టిన అధికారులూ ప్రస్తుతం పట్టించుకోకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. మొక్కల సంరక్షణకు ఏర్పాటు చేసిన పెన్సింగ్, గేట్లు ధ్వసం అవడంతో పశువులు ప్రవేశిస్తున్నాయి. అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది తక్షణమే స్పందించి పల్లెప్రకృతి వనాల్లోని చెత్తాచెదారాన్ని తొలగించి, నీటి సౌకరాన్ని కల్పించాలని, మొక్కలను సంరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



బృహత్ పల్లె ప్రకృతివనంలో ఎండిపోతున్న మొక్కలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ధర్మసాగర్ : మండలంలోని వివిధ గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్‌శాఖ ఏఈ సుధాకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు జరుగుతున్న కారణంగా పెద్ద పెండ్యాల, ఉనికిచర్ల (టేకులగూడెం)గ్రామాల్లో సోమవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ఐనవోలులో..

ఐనవోలు : మండలంలోని వెంకటాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని మలక్‌పల్లి 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్టు కొమ్మల తొలగింపు, లైన్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఇన్‌చార్జ్ ఏఈ శివకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వనమాలకనపర్తి గ్రామం విద్యుత్ వినియోగదారులతో పాటు వ్యవసాయ కనెక్షన్‌లు కలిగిఉన్న వినియోగదారులు సహకరించాలని కోరారు.

పలువురిపై కేసు నమోదు

దామెర : మండలంలో రెండు బెల్ట్ షాపుల నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ ఆదివారం తెలిపారు. ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన గొడిశాల క్రాంతికుమార్‌కు చెందిన బెల్ట్ షాపుపై ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు దాడి చేసి అతని వద్ద నుంచి రూ. 10,660 విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నడికూడ మండలం కంఠాత్మకూరు గ్రామానికి చెందిన ఆకుల భిక్షేశ్వర్‌కు చెందిన బెల్ట్ షాపుపై పోలీసులు దాడి చేసి రూ. 2,920 విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జెడ్పీహెచ్ఎస్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. 1998-99 సంవత్సరంలో పదోతరగతి తరగతి చదువుకున్న విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల రోజులను నెమరువేసుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు ఆనంద్‌కుమార్, నిర్మలదేవి, రమణాచారి, రామస్వామి, వేణుగోపాల్, రాజిరెడ్డి, కరుణాకర్, వీరయ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు.

దామెరలో..

దామెర : మండలంలోని పులుకుర్తి ప్రభుత్వ పాఠశాలలో 2005-06 సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. 19 సంవత్సరాల తరువాత కలిసిన బాల్యమిత్రులను ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాటి మధుర స్మృతులను నెమరువేసుకొని ఆనందంగా ఆడుతూ, పాడుతూ గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు సత్యనారాయణ, సూరిబాబు, సంపత్, అరుణ, శారద, ప్రణతి, రామచంద్రం, రజిత, అజయ్, కుమారస్వామి, వార్డన్ చంద్రయ్య పాల్గొన్నారు.



దామెర : సమ్మేళనంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

'నాగుర్ల'పై ఆరోపణల వెనుక దుష్టశక్తులు

- ఆరెసంక్షేమ సంఘం, తెలంగాణ రైతువిభాగం నాయకులు

పరకాల : రాజకీయంగా ఎదుగుతున్న తెలంగాణ రైతు ఋణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లుపై సోమనాథ్ చిట్‌ఫండ్ యాజమాని చేసిన ఆరోపణలను ఖండిస్తున్నట్లు ఆరెసంక్షేమ సంఘం, తెలంగాణ రైతువిభాగం నాయకులు తెలిపారు. పట్టణంలోని స్వర్ణగార్డెన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. తెలంగాణ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చందర్‌రావు, ఆరెసంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు శంకర్‌రావు, లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. సోమనాథ్ చిట్‌ఫండ్ యాజమాని దుమాల బాపురావు ఆత్మహత్యయత్నానికి నాగుర్ల వెంకటేశ్వర్లు పేరును ప్రస్తావించడం బాధ కలిగించిందన్నారు. వాస్తవానికి సోమనాథ్ చిట్‌ఫండ్‌తో పాటు ఆర్బిట్ ఫార్మా కంపెనీలో నాగుర్ల వెంకటేశ్వర్లు (37 శాతం వాటా) ద్వారా భాగస్వామ్యంగా ఉండి 2021 ఏప్రిల్ 10న ఇరువురి అంగీకారంతో తప్పుకోవడం జరిగిందన్నారు. తన ద్వారా చిట్‌ఫండ్‌లో సభ్యులుగా చేరిన వారికి న్యాయంగానే డబ్బులు ఇప్పించారన్నారు. మరికొందరికి న్యాయం చేయాల్సి ఉందన్నారు. కానీ ఏనాడు బాపురావును వేధించిన సందర్భాలు లేవన్నారు. నాగుర్లపై ఆరోపణల వెనుక కొన్ని దుష్టశక్తులు ఉన్నాయని ఆరోపించారు. ఆరెసంక్షేమ సంఘం నాయకులు లక్ష్మణ్‌రావు, శివాజీ, కందెరావు, వీరేష్‌రావు, రైతు విభాగం నాయకులు వరికెల కిషన్‌రావు, అన్నారెడ్డి, బాబుమియా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోర్తాల చందర్‌రావు

ముగిసిన చెన్నకేశవస్వామి జాతర

దామెర : మండలంలోని కోగిల్వాయి చంద్రగిరి చెన్నకేశవస్వామి జాతర ఆదివారంతో ముగిసింది. చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గుట్టపై 15 రోజులపాటు నిర్వహించిన జాతరకు భక్తులు భారీగా చేరుకొని స్వామివారికి మొక్కులు చెల్లించారు. పెద్దగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. టెంకాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వెంకటజోగాచార్యులు, పూజారులు దివి మురళిధరాచార్యులు, దివి కేశవాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించి గ్రామంలోని ఆలయానికి తీసుకొచ్చారు. భక్తులు పోటెత్తడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయ కమిటీ చైర్మన్ గుండ సురేష్, వైస్ చైర్మన్ పాలకుర్తి అశోక్, చుక్క సాంబయ్య పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు



ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బీజేపీలో పలువురి చేరిక

వరంగల్ : గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ పైడిపల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. పైడిపల్లి మాజీ సర్పంచ్ కంది రాజేందర్, డైరెక్టర్ లింగం కోటిలింగం, ఆకుల రంజిత్ కుమార్, ఎర్రగొల్ల కుమార్ తదితరులు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి హంటర్‌రోడ్డులోని కార్యాలయంలో బీజేపీలో ఆదివారం చేరగా, వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని కోరారు. నాయకులు శ్రీనివాస్, రంజిత్, ఆరోగ్యం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన కారు

నడికూడ : రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని నర్సక్కపల్లి బస్‌స్టాప్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామప్ప నుంచి హుజూరాబాద్‌కు వస్తున్న కారును నర్సక్కపల్లి బస్‌స్టాప్ వద్ద భూపాలపల్లి నుంచి ఉప్పల్‌కు బొగ్గు తరలిస్తున్న లారీ వెనక నుంచి ఢీ కొట్టింది. ఈ క్రమంలో బస్‌స్టాప్ వద్ద ఆగి ఉన్న హుజూరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును కారు వెనుక నుంచి ఢీ కొనడంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులకు క్షతగాత్రులను పరకాల ఆస్పత్రికి తరలించారు. డయల్ 100కు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి పరకాల పోలీసులు చేరుకొని ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు సన్నాహక సమావేశం

శాయంపేట : మండల కేంద్రంలోని ఎస్వీకేకే ఫంక్షన్ హాల్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరు కానున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

ఐనవోలు మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు



ఐనవోలు : ప్రఖ్యాత ఐనవోలు మల్లన్నను తీన్మార్ మల్లన్న ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు తీన్మార్ మల్లన్నకు మల్లికార్జునస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శివ, మధు, మధుకర్, మురళి, రవీందర్, అశోక్, మోహన్, రఘువర్మ, రాకేష్, ప్రశాంత్, సురేష్, రాజు, కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థిని గెలిపించాలి

దేశాయిపేట: వరంగల్ తూర్పులోని 230 బూత్‌ల్లో బీజేపీ అభ్యర్థికి ఆధిక్యం తీసుకువచ్చే విధంగా నాయకులు, కార్యకర్తలు కష్టపడితే గెలుపు సాధ్యమని వరంగల్ తూర్పు నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. దేశాయిపేటరోడ్డులోని బీజేపీ క్యాంపు కార్యాలయంలో వరంగల్ పార్లమెంట్ పరిధి తూర్పులోని 12, 13, 18, 19, 21, 27వ డివిజన్ల బూత్ అధ్యక్షులు, బూత్ కార్యకర్తలతో ఆదివారం సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీబూత్‌లో 370ఓట్లు బీజేపీ అభ్యర్థికి వస్తే విజయం తథ్యమన్నారు. అనంతరం పార్టీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాషాయ జెండా ఎగురవేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. పార్టీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రభారి డాక్టర్ వి.మురళీధర్‌గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, వన్నాల శ్రీరాములు, టి.కుమారస్వామి, శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ : రేవూరి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఎం.డీ ఖాజాబాయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో పాల్గొని మాట్లాడారు. రంజాన్ సందర్భంగా ముస్లింలు అత్యంత నిష్ఠతో ఉపవాస దీక్ష చేస్తున్నారని, వారికి ఇఫ్తార్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కులమతాలకు అతీతంగా హిందు, ముస్లింలు సోదర భావంతో మెలగాలని అన్నారు. అనంతరం ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. రంజాన్ ను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, వర్కింగ్ అధ్యక్షుడు పరికిరాల వాసు, పర్వతగిరి రాజు, బాబుమియా, సందీప్, జైపాల్‌రెడ్డి, రణధీర్ రెడ్డి, కిరిటీ, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

క్రోధి నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరణ



ప్రశాంత్‌నగర్ కాలనీలో పంచాంగాన్ని ఆవిష్కరించిన సభ్యులు

కాజీపేట: క్రోధి నామ సంవత్సర పంచాంగాన్ని చాత్తాద శ్రీవైష్ణవ ఉమ్మడి వరంగల్ జిల్లా సభ్యుల విస్తృత స్థాయి సమావేశంలో వేద పండితులు ఆదివారం ఆవిష్కరించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు, వికాస తరంగిణి బాధ్యుడు దాస్యం రంగనాథ స్వామి ఆధ్వర్యంలో ప్రశాంత్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంచాంగాన్ని విడుదల చేసి సభ్యులకు అందజేశారు. శ్రీమాన్ సంపన్ముడుంబై వెంకటాచార్య సిద్ధాంతి రచించిన పంచాంగాన్ని వంద మందికి ఉచితంగా అందించారు. కార్యక్రమంలో కృష్ణ, వేణుగోపాల్, గోవిందం, సునీత, మురళి, రూపావతి పాల్గొన్నారు.

మతోన్మాద పార్టీని ఓడించండి

న్యూశాయంపేట: మతోన్మాద బీజేపీని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని వామపక్షాల నాయకులు పిలుపునిచ్చారు. హనుమకొండ రాంనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వాసుదేవరెడ్డి అధ్యక్షతన వామపక్షాల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలు నానా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగులు రోడ్డున పడ్డారని తెలిపారు. సమస్యల నుంచి ప్రజలను పక్కదారి పట్టించేందుకు దేశంలో కుల, మతాల పేరుతో వైషమ్యాలు సృష్టిస్తూ మతోన్మాద చర్యలకు పాలకులు పాల్పడుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 11న హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో వామపక్షాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరగనున్న జిల్లా సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వామపక్షాల నాయకులు బి.చక్రపాణి, కే.భిక్షపతి, శివాజీ, నాగార్జున, బాలరాజ్, రాజు, భాస్కర్, నవీద్, చుక్కయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద ఆస్పత్రిలో పండ్ల పంపిణీ

కాశిబుగ్గ: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం, జనయేత్రి ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాలలో రోగులకు జనయేత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పండ్లు పంపిణీ చేశారు. పండ్లు పంపిణీ చేయడం సతంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు మహమ్మద్ రహీంఖాన్, కార్యదర్శి పవన్‌కుమార్, శ్రీధర్, ఖాజా, జమీల్, వైద్యులు శ్రీలత, అక్షిత, మానసతో పాటు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.